మైథిలికీ సందేశాలు మొదలయ్యాయి. ఆమె ఎక్స్‌రే కళ్లకు ఆ మెసేజుల వెనక ఎవరెవరు కుళ్లుకుంటున్నదీ, ఈర్ష్య పడుతున్నదీ, సహృదయంతో ఎవరు రాసింది.. స్పష్టంగా కనిపించాయి. ఎవరు ఫోన్ చేయకుండా, ఎంత విలవిలలాడుతున్నారో కూడా జానపద సిని మాల్లో చూపించే మాయాదర్పణంలో మైథిలికి స్పష్టంగా కనిపిస్తున్నారు! మైథిలి ఈ విషయంలో ఎంతో నైపు ణ్యాన్ని సంపాదించింది. తేలిగ్గా పసిగడుతుంది!

మరో కాల్! చెల్లి రతిక నుంచి.

''అక్కా! మీ ఉదయ్‌పూర్ ఫొటోల్ని స్క్రీన్‌షాట్ తీసి, నా స్నేహితులతో షేర్ చేసుకున్నా. అందరూ నీకు, బావకూ బెస్ట్‌విషెస్ చెప్పమన్నారు''.. అలా నాలుగు నిమిషాలు మాట్లాడింది రతిక.

మొదటి ఓవర్‌లోనే మంచి పరుగులు సంపాదించింది మైథిలి!

కథకు కాస్త వెనక్కి వెళ్తే.. ఈ రాజస్థాన్ యాత్రకు మూలకారణం బయటపడుతుంది.

* * *

నాలుగేళ్ల క్రితం.. రోజటిలాగే స్టేటస్‌లలో ఫొటోల్ని చూసింది మైథిలి. దూరపు బంధువొకరు వారి ఉదయ పూర్ యాత్ర ఫొటోల్ని వాట్సప్‌లో పెట్టింది. తిరుగు తున్న ప్రదేశాల్ని రన్నింగ్ కామెంటరీలా ఫొటోలతో పంచుకున్నది. అప్పటినుంచీ ఆ సుందరనగరాన్ని ఎప్పటికైనా చూడాలని నిర్ణయించుకున్నది మైథిలి.

మైథిలి వల అల్లింది. లోకేశ్ సునాయాసంగానే చిక్కి తలూపాడు. లేకపోతే పర్యవసానాలు తెలుసు తనకు. స్టేటస్‌లో పెట్టిన ఫొటోలను చూపెట్టమని మైథిలిని ప్రేమతో బతిమాలాడు. దగ్గరగా జరిగి.. ప్రేమతో మైథిలి అన్ని ఫొటోల్నీ లోకేశ్‌కు చూపించింది. ఆ ఫొటోలు పెట్టి నావిడను మనసులో తిట్టుకున్నాడు లోకేశ్.

ఇద్దరిప్పుడు ఉదయ్‌పూర్‌లో!

లంచ్ చేస్తున్నప్పుడు మొబైల్‌లో ఘంటిక. మృదువైన సంగీత సంకేతం. చపాతీ తింటున్న మైథిలి.. మెడను చటుక్కున తిప్పి మొబైల్ చూసింది. తమ్ముడి భార్య నుంచి. ఏదో ఉడికించే విషయం ఉంటే తప్ప.. తమ్ముడు ప్రేమించి చేసుకున్న నార్త్ ఇండియన్ మరదలి నుంచి ఈ వాయుగుండ ప్రేరిత గాలి రాదు.

లోకేశ్‌కు చిరాగ్గా ఉంది. మైథిలి లంచ్ సరిగా చేయ డంలేదు. యాంత్రికంగా తింటున్నది. తనకు కంపెనీ ఇవ్వడమే లేదు. ఎన్నోసార్లు చెప్పాడు.. తినేటప్పుడు మొబైల్ దూరంగా పెట్టమని. స్క్రీన్ కనిపించకుండా బోర్లించి ఉంచమని. కబుర్లు చెప్పుకొంటూ.. రుచుల్ని ఎంజాయ్ చేస్తూ తినాలని.. కలిసి తిందామని!

తన చూపుమేరకు కనిపిస్తున్న మిశ్రమవర్ణాల్లో ఉన్న టూరిస్టుల్ని చూస్తూ.. మెల్లిగా లంచ్ కానిస్తున్నాడు లోకేశ్.

''మా తమ్ముడువాళ్లు శ్రీనగర్‌లో ఉన్నారట. రోహిణి మెసేజ్ చేసింది. స్టేటస్‌లో ఫొటోలు పెట్టింది. చూస్తావా?''.. జంకుతో అడిగింది మైథిలి.

''లంచ్ అయ్యాక చూస్తా! నీ లంచ్ కానివ్వు. బయట పడదాం!''..

మైథిలి చేతిలోంచి మొబైల్ తీసుకొని, తనవైపు జరిపి బోర్లించి పెట్టాడు.

'తిను!' అని బతిమాలుతున్న చూపులతోనే చెప్పాడు.

స్పీడ్‌గా తింటున్న మైథిలిలో.. 'ఎప్పుడెప్పుడు లంచ్ మింగేసి, ఫొటోల్ని లోకేశ్‌కు చూపిద్దామా!?' అన్న ఆతృతే ఎక్కువ ఉన్నది.

ఆ క్షణాల్ని మధురస్మృతులుగా మార్చుకోలేక, పంజ రంలో కొట్టుకుంటున్న పక్షిలాంటి మైథిలి వైపు జాలిగా చూస్తున్నాడు లోకేశ్. చేతులు తుడుచుకొని మైథిలి తన ఫోన్ తీసుకున్నది.

సైట్ సీయింగ్ కోసం టాక్సీ కుదుర్చుకున్నారు. అప్ప టికే ఇరవై నిమిషాలు ఆలస్యం. బయల్దేరే ముందు మైథిలి బలవంతాన లోకేశ్‌ను హోటల్ లాంజ్‌లో కూచో బెట్టి.. శ్రీనగర్ ఫొటోల్ని చూపించింది!

''మన నెక్ట్స్ ట్రిప్ అక్కడికేనండి. మీరు మాటి వ్వాలి!'' గోముగా మైథిలి.

''మొదట ఉదయ్‌పూర్ కానిద్దాం! పద.. పద!'' తొందరపెడుతూ లోకేశ్.

చిరుకోపంతో లోకేశ్ వెంట నడిచింది మైథిలి.

* * *

సిటీ ఆఫ్ లేక్స్ అని పిలిచే నగరంలో మూడు రోజులు గడిచాయి. చరిత్రను పుష్కలంగా నింపుకొన్న రాజస్థాన్. ఎటు చూసినా రాజులు, రాణులు, యుద్ధాలు, మర ణాలు, ఎత్తులు, చిత్తులు, కోటలు, కత్తులు, తోపులు, వీరత్వం, శూరత్వం, జీవన సమర్పణ, అంకిత భావాలు, యుద్ధప్రదేశాలు.. ఎంత రాసినా తక్కువే! అన్ని కోణాలనుంచీ పరిశోధించిన రాష్ట్రం. అక్షరాలతో అలంకరించి, అచ్చుల్లో నిక్షిప్తమై, పుస్తకాల రూపాల్లో బహిర్గతమై, ఎన్నో రకాల పెయింటింగులతో గత వైభ వాన్ని కళ్లకు కట్టినట్టు చూపే రంగుల హంగులు.

హల్దీఘాటీ.. అక్కడి మట్టిరంగు పసుపుపచ్చ. పసిడి రంగుతో వందల ఏళ్లనుంచి చెదరకుండా ప్రకృతికి దీటుగా నిల్చొని, పర్యాటకుల్ని తనవద్దకే రప్పించుకొం టున్న భీకర యుద్ధప్రదేశం. మేవాడ్ సైన్యాలు, మొఘల్ సైన్యాలు 1576లో కత్తులు దూసుకున్నది ఇక్కడే! రాణా ప్రతాప్, ఆయన గుర్రం చేతక్‌ను గుర్తుకుతెచ్చే వీర భూమి ఇది. ఉదయపూర్ నుంచి నలభై అయిదు కిలో మీటర్లే!

మైథిలి ఆనందానికి అంచుల్లేవు. ఇప్పటివరకూ చూసిన ప్రదేశాలు, వాటి గురించి వింటూ అర్థం చేసు కున్న చరిత్ర, కథలు, నమ్మకాలు, ప్రజల్లో తమ సంస్కృ తుల పట్ల ఉన్న గౌరవం.. ఒక కొత్త ప్రపంచం. దేశంలో రాజస్థాన్ మరో దేశంలా అనిపించింది! వైవిధ్యం. లోకేశ్ తానొక కొత్త ప్రదేశం చూడటంతోపాటు, మైథిలి ఎంతో సంతోషంగా ఉంటున్నందుకు అమితానందంతో ఉన్నాడు. ఆమె అడిగిన చోటల్లా ఓపిగ్గా ఫొటోలు తీస్తు న్నాడు. తను కోరిన పోజుల్లో విసుక్కోకుండా.. మైథిలి సంతోషానికి అనుకూలంగా భార్య అందాల్ని మొబైల్ ఫోన్లో నింపేస్తున్నాడు. రాజస్థాన్లో తెలుగు రాజా – రాణీ నవ్వుతూ.. రకరకాల నేపథ్యాలతో మైథిలి ఎన్ని సెల్ఫీ లను తీసుకున్నదో? ఒంటరిగా తీసుకున్న ఫొటోలు వందల్లో..

ఈ చిత్తరువుల ప్రధాన గమ్యస్థానం ఒక్కటే! వాట్సప్‌లో స్టేటస్! దాని ద్వారా మైథిలికున్న తన సామా జిక ప్రపంచానికి చేరాల్సిందే! అది కలిగించే ప్రభావం బహురూపాల్లో బహిర్గతం. ఊహించని దిశల్లో, కోణాల్లో శాస్త్రవేత్తలకు, పరిశోధనలకు తాజా ముడిసరుకు.

మైథిలి హల్దీఘాటీ రోడ్డుకు అటువైపు నడిచింది. రోడ్డు నల్లతాచులా ఉంది. చెక్కిన కొండల పసుపురంగు, పసిడి పట్టుచీరలా కనిపిస్తే.. ఫొటో తీయమని మొబై ల్‌ను లోకేశ్‌కు ఇచ్చి.. మైథిలి రోడ్డు దాటింది. రోడ్డుకు ఇటువైపు లోకేశ్ ఫొటోలు తీయడానికి.. అటువైపు స్టిల్ ఫొటోలకు పోజులివ్వడానికి వెళ్లిన మైథిలి. కోరినట్టుగా క్లిక్కులు. మైథిలి ఓ కొత్తలోకంలో విహరిస్తున్నది. అప్పు డప్పుడూ 'రయ్ రయ్!' అంటూ వేగంగా పోతున్న వాహనాలు. కొన్ని ఫొటోల్లో మైథిలికి బదులు వాహ నాలు! లోకేశ్ బాధపడ్డాడు.

'ఫొటోల్ని ఎప్పుడెప్పుడు చూడాలి? సెలక్ట్ చేసి వెంటనే స్టేటస్‌లో పెట్టాలి?' అన్న ఉత్సాహంతో మైథిలి వేగంగా రోడ్డు దాటేందుకు అడుగులు వేసింది.

అంతే..!

గుర్తుతెలియని వాహనం ఆమెను గట్టిగా కొట్టేసి దూసుకుపోయింది. నల్లటి రోడ్డుపై ఎర్రటి రక్తపు మడు గులో మైథిలి. కొన్నిక్షణాలు విలవిలా కొట్టుకున్నది.

లోకేశ్‌కు ఏమయ్యిందో తెలియలేదు. షాక్‌తో ఎలాగో రోడ్డుదాటి అక్కడి స్థితిని చూసి కళ్లుతిరిగి పడిపోయాడు.

అక్కడ పడిఉన్న ఒక శరీరంలో శ్వాస ఆడుతున్నది. మరో శరీరంలో శ్వాస ఆగి కొన్ని క్షణాలు అవుతున్నది.

* * *

లోకేశ్ ఒంటరి జీవితానికి అలవాటు పడుతున్నాడు. ఇల్లంతా శూన్యం. ప్రమాదం తాలూకు ఫొటోలు, వీడియో క్లిప్పులు ఆయనకు తెలియకుండానే వైరల్ అయ్యాయి. దేశమంతా పాకిపోయాయి. లోకేశ్ వాట్స ప్‌కూ చేరాయి. మొదటిసారి చూసినప్పుడు బాగా ఏడ్చాడు. మళ్లీ మళ్లీ అవే తిరిగి వచ్చినప్పుడల్లా.. నిశ్శ బ్దంగా, పరీక్షగా చూస్తాడు. కళ్లు మూసుకొంటాడు. శూన్యంలోకి అదోలా చూస్తాడు. పిచ్చిగా అరుస్తాడు.

జీవితం ఊహించని కొత్తరీతికి అలవాటు పడుతుంది.

లోకేశ్ చేతిలో మైథిలి మొబైల్.. రోజూ ఆమె వాట్సప్ తెరుస్తాడు. ఒకసారి కాదు. సమయం చిక్కినప్పుడల్లా! మైథిలి చూసే స్నేహితుల స్టేటస్‌లలో ఫొటోల్ని చిత్రంగా, అదోలా చూస్తుంటాడు.

ఉదయ్‌పూర్ ప్రయాణంలో తీసిన వందల ఫొటో ల్లోంచి.. ప్రతిరోజూ ఒక ఫొటోను మైథిలి స్టేటస్‌లో పెడుతూనే ఉన్నాడు లోకేశ్. ■

## టి. సంపత్ కుమార్



ఒక చేతితో హలం పట్టి వ్యవసాయం చేస్తూ.. మరో చేతితో కలం పట్టి కథకుడిగా రాణి స్తున్నారు టి. సంపత్ కుమార్. పుట్టింది నిర్మల్ జిల్లా ఖానాపూర్. ఉస్మానియా విశ్వవిద్యా లయం నుంచి ఎంఎస్సీ చేశారు. ఢిల్లీ ఐఐటీ నుంచి పీహెచ్‌డీ పట్టా పొందారు. కేంద్ర ప్రభుత్వ శాఖలో ఉన్నతోద్యోగం చేసి, ముఖ్య సలహాదారుగా విరమణ పొందారు. ప్రస్తుతం నిర్మల్‌లో ఉంటూ, వ్యవసాయం చేస్తున్నారు. 1987 నుంచి కథలు రాస్తున్నారు. ఇప్పటివరకూ 50 కథలు, ఒక నవల (కదలికలు) రాశారు. లియోసా, పెన్నులు, 'నా' నుంచి 'మన' వరకు కథా సంకలనాలను వెలువరించారు. లియోసా, రించిన్, పెన్నులు, చంద్రి–78,000, తాతయ్య దంతం, అనగా అనగా ఒక దేశం, 'ఘ'బాయ్, 'అ'సాధారణత్వం కథలు పాఠకుల మన్ననలు పొందాయి. 'చంద్రి–78,000' కథ.. కేంద్ర సాహిత్య అకాడమీ హిందీ సంకలనంలో, 'లియోసా' కథ ఐదు ప్రత్యేక సంకలనాల్లో చోటు దక్కించుకున్నాయి. వీరి కథలు అన్ని ప్రముఖ దిన, వార, వెబ్ పత్రికల్లో ప్రచురితమయ్యాయి. సాహితీ సేవలో భాగంగా అనేక సన్మానాలు, పురస్కారాలు, బహుమతులు అందుకున్నారు.